కథానిక

రాజీ

శ్రీ కొమరగిరి నరసింహారావు

"నాన్నా...నాన్నా!...నాన్నా!"

"ఊఁ."

"ఇటు చూడు నాన్నా."

"ఊఁ."

"అబ్బ, యిటు చూడమంటుంటే."

బలవంతంగా చేత్తో నా మొహాన్ని తనవైపుకు తిప్పుకొన్నాడు వాసు. ఇంక పనేం సాగుతుంది. వాడిని సమాధానపఱచి పంపిస్తేనేగాని పని సాగదు. ఉండీ, ఉండీ, వాడికేదో సందేహం కలుగుతుంది. ఆ సందేహనివృత్తి అయ్యేవరకు వాడికి తోచదు. ఏదో ప్రశ్న పరంపరలు కురిపిస్తాడు. మనం చెప్పే జవాబు వాడికి తృప్తి నివ్వదు. అర్థమూ కాదు. అయినా తప్పదు. కలం క్రిందపెట్టి వాడివైపుచూశాను, ఏమిటి అన్నట్టు.

"అ దేమిటి నాన్నా?" పూర్వాకాశంలో సూర్యుడి కడ్డంగా పరుగెత్తే మేఘశకలాలను కిటికీలోంచి తన చిరుహస్తంతో చూపిస్తూ అడిగాడు.

బాలభానుని కిరణకాంతిలో జలతారు తీగల్లాగా మెరిసే ఆ మేఘపు అంచులు కన్నుల పండువై బాలుడి కుతూహలాన్ని రేకెత్తిస్తున్నై. జలదమాలికలలోంచి రవి తన కిరణాలను నలువైపులా వెల్లువలుగా విరజిమ్ముతున్నాడు. ప్రభాతవాయువీచికలలో మేఘాలు దూదిపింజలలాగా పరువెత్తుతున్నై.

"ఏమిటి నాన్నా అదీ?"

మందహాసంతో ప్రకృతిశోభను తదేకదృష్టితో తిలకిస్తూన్న నా ముఖాన్ని మళ్ళీ తనవైపుకు తిప్పుకుంటూ అడిగాడు వాసు.

"అవి మేఘాలు" అన్నాను.

"మేఘాలా?... ఎందుకు నాన్నా అట్లు పరుగెత్తుతూన్నై?"

"వేగంగా గాలి వస్తూంటే ఆగలేక పరుగెత్తుతూన్నై."

"ఎంత దూరం పరుగెత్తుతాయి?"

"ఓ, గాలి ఆగేదాకా ఎంతదూరమయినా పరుగెత్తుతై."

"అయితే కింద పడిపోవూ మరీ?

ఇదీ వరుస. ఈ ప్రశ్నలకిక అంతూ పంతూ లేదు. ధారాపాతంగా కురుస్తూనే ఉంటాయి. వీటన్నిటికీ జవాబు చెప్పాలంటే శాస్త్రంలోకీ, శాస్త్ర సిద్ధాంతంలోకీ దిగవలసివస్తుంది. అవన్నీ నాకే అర్థంకావు. ఆ చంటివాడికేమర్థమౌతాయి.

అయితే, ఎలా వీణ్ణి వదిలించుకోవటం? ప్రొద్దెక్కుతోంది. ఆఫీసుకు వెళ్ళాలి. ఈ ఫైళ్ళన్నీ తిరగవేసి నోట్ పుటప్ చేసి యీరోజు ఆఫీసులో సబ్‌మిట్ చెయ్యాలి. లేకపోతే ఆఫీసరును చూడటానికి మొహం చెల్లదు.

మెల్లిగా వంటయింట్లోకి పంపిస్తే కొంత బాధ తీరిపోతుందేమో ననిపించింది.

"ఒరేయ్, బాబూ, చూడూ. నేనూ, త్వరగా ఆఫీసుకు వెళ్ళాలిగనీ, అమ్మదగ్గరి కెళ్ళి వంటయిందేమో కనుక్కోరా." అంటూ వీపు తట్టి లోపలికి పంపించాను.

పరుగెత్తుకొంటూ లోపలికి వెళ్ళాడు.

మా రాజ్యానికి వాసుమీద అమితమైన ఆపేక్షే గాని ఏదైనా పనిమీద ఉన్నప్పుడు చీటికిమాటికి పలకరిస్తూంటే ఆమెకు మహాచెడ్డ చికాకు పుడుతుంది. ఒక్కొక్కమాటు వాడిమీద కసురుకుని తనను నాలుగు తిట్టుకుని వాణ్ణి నాలుగు తిట్టి అవసరమైతే రెండు అంటించి నాదగ్గరకు పంపిస్తుంది. పిల్లల మనస్తత్వంమీదా, శిశుపోషణమీదా పుస్తకాలూ, ఏ పత్రికలూ చదువకుండానే వాసు పుట్టింతరువాత యీ రెండుమూడేండ్లూ గడచిపోతూన్నై ఆమెకు. తెల్లవారజామున లేచింది మొదలు రాత్రి పడుకోబోయేవఱకూ పనిమనిషి లేని యీ సంసారాన్ని రాట్నంలాగా పనిచేస్తూ ఎలాగో ఓలా దిద్దుకుపోతున్నది.

నాకూ, ఆఫీసుఫైలుతోటీ, ఆఫీసర్ల చివాటతోటీ తలప్రాణం తోకకు వస్తూన్నా ఆ ఉద్దరి జీతపు నీళ్ళల్లోనే యీతకొడ్తూ ఏదో రకంగా యీ జీవితసారథ్యాన్ని ఆగకుండా నడుపుకు రావడంలో వాణ్ణిగురించి అట్టే శ్రద్ధ తీసుకోటానికి ఓపిక లేకుండావుంది. వాడూ అల్లరిపిల్లవాడు కాకపోయినా, ఆఫీసుఫైల్సులో కుతికల వఱకూ మునిగి ముక్కో చెవో అనుకుంటూ గడియారం ఎప్పుడు పది కొడుతుందో అని నిమిషాలు లెక్కపెడ్తూ చికాకుగా ఉన్న సమయంలో ఏవో కుంటిప్రశ్నలతో అంతూపంతూ లేకుండా మాట్లాడిస్తూంటే సహించటం కష్టమై పోతూంటుంది. ఏదో పని చెప్పి మెల్లిగా వంటఇంట్లోకి పంపించటం మామూలైపోయింది.

తిరిగి కాగితంమీద కలం పెట్టానో లేదో పరుగెత్తుకుంటూ వచ్చాడు వాసు.

"వంటయిందట నాన్నా, నిన్ను స్నానం చెయ్యమంది అమ్మ," అనుకుంటూ దగ్గరికి వచ్చాడు.

నాకు తెలుసు యింకా వంట అయివుండదని, ఈ మాట చెప్పేమిషమీద మళ్ళీ నాదగ్గరకు పంపించింది వాణ్ణి రాజ్యం.

"ఊఁ, సరేలే వస్తున్నా వెళ్ళు," తలవంచుకుని వ్రాసుకుంటూనే జవాబు చెప్పాను.

వాడు కదలలేదు. ఇంకా దగ్గిరికివచ్చి రెండు మోచేతులూ నా వ్రాతపలకమీద మోపి తన గడ్డాన్ని అరచేతుల్లో నిలిపి దీర్ఘంగా నేను వ్రాస్తున్న అక్షరాలకేసి చూస్తున్నాడు. నేను తొణకలేదు.

ఉండీ, ఉండీ, తలయెత్తాడు. ఏదోఆలోచన తట్టింది కాబోలు.

"నాన్నా, అమ్మ నీకేమవుతుంది నాన్నా?" అని నాముఖంలోకి సూటిగా చూస్తూ అడిగాడు.

పనితొందరలో ఒకచెంపన చికాకుగా ఉన్నా నాకు నవ్వు ఆగలేదు. వాడికీ ప్రశ్న ఎందుకు తట్టిందో! అవును, ఎప్పుడూ ఆశేయ్ ఒశేయ్ అని పిలవటంతప్ప ఒక వరుసగానీ ఒక పేరనగానీ పిలచిన పాపాన పోలేదాయెను, మరి.

ఏదో విధంగా సమాధానం చెప్పినా అది ఇంకో ప్రశ్నకు దారితీయటంతప్ప మరేమీ ప్రయోజన ముండదనీ, ఆ భారం తల్లిమీదనే పడేస్తే వాడూ, అదీ ఏమైనా తంటాలు పడనిమ్మనీ అనుకుని "ఒరేయ్, నాకు తెలియదుగాని మీ అమ్మ నడుగు పో, చెపుతుంది" అని మళ్ళీ వంటయింటిముఖంగా తిప్పి పంపించేశాను.

"అమ్మోయ్, అమ్మా!" అని కేకలేస్తూ వాడు లోపలికి పరుగెత్తాడు.

చురచురా ప్రొద్దెక్కుతున్నది. తొమ్మిది గంటలు కావస్తున్నది. కావలసిన పనిలో సగం కాలేదు. తలచుకుంటే గుండె దడదడలాడుతున్నది. ఎలాగూ ఈ రోజు మళ్ళీ చివాట్లు తప్పవు. త్వరగా ఆ కాస్తా ఏదో విధంగా పూర్తిచేసివాళ్ళమొగాన పారేస్తే సరిపోతుందంటే బొత్తిగా చెయ్యిసాగటంలేదు. తొందర పడ్డకొద్దీ ఇంకా నాలుకు కొట్టివేతలూ తుడుపులూ పడి ఆ చేసినపని కాస్తా పాడైపోవటంతప్ప మరేమీ ప్రయోజనముండదు. పోనీ, యీ ఒక్కరోజూ శెలవుపెడ్దామా అంటే— ఏం లాభం? ఒక్కరోజుతో సరిపోతుందా, రోజూ యిదేఅవస్థగా! ఈ గుమాస్తా బ్రతుకు దినగండం నూరేళ్ళాయుస్సుగా తయారయిందాయెను.

ఏమయితే అదే అయింది, ఈరోజు కిక కట్టిపెట్టి త్వరగా స్నానంచేసి నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని దోవన బడ్దామని మెల్లగా కాగితాలన్నీ కట్టకట్టి లేవబోతూండగా......

"రామ రామ రామ! ఎల్లా చచ్చేదండీ వీడితోటీ; అస్తమానమూ ఒకటేగోల! తలా తోకా లేని ప్రశ్నలు వేస్తూ బొత్తిగా పని సాగనీయడాయెను. కాసేపు మీ దగ్గర వుంచుకో గూడదుటండీ, ఆ కాస్త వంటా అయ్యిందాకా?" అని పిల్లవాడి రెక్కపట్టుకుని లాక్కొచ్చి నాకేసి చూసి ఉరుముతూన్న మా రాజ్యానికి కండ్లప్పజెప్పి మళ్ళీ కుర్చీలో కూలబడ్డాను.

"చూస్తారేమండీ మాట్లాడకుండానూ?"

"ఊఁ. ఏం మాట్లాడమంటావు, కనపట్ల నా కాయితాలూ నేనూ? వాడిక్కడ కూచుంటే నా పనేమయినా సాగాలా?" కాస్త కుదురుకుని ప్రత్యుత్తరంగా ఎదురు ప్రశ్న వేశాను.

రాజ్యానికి యింకా కొంచెం వేడెక్కింది.

"మరి తొమ్మిదింటి కల్లా వంట కావాలని పురమాయిస్తుంటే ఎలా అవుతుంది చెప్పండి. వాడు వంటయింట్లోకి వస్తే ఒక పనికి నాలుగు పనులు కలిపిస్తాడు. ఉదయంపూట కాసేపు వాణ్ణి మీ దగ్గిరవుంచుకోకపోతే తొమ్మిదింటికి వంట కావటం కష్టం. తరువాత నామీద కోప్పడి ఏమీ లాభం ఉండదు. మీ యిష్టం."

"అయితే యింట్లో వున్న యీ కాసేపయినా కాస్త స్తిమితంగా రాసుకోకపోతే యీ లెక్కలన్నీ ఎల్లా తయారైయేడుస్తై? ఆడదానిని అంతమాత్రం వాణ్ణి సవరించుకోలేకపోతే మొగవాణ్ణి, ఆఫీసుకు వెళ్ళవలసినవాణ్ణి నేను వళ్ళో పెట్టుకుని కూర్చుంటానా ఏం వాణ్ణి?"

"ఏమో అదంతా నాకేం తెలుస్తుంది. అన్నీ దర్జాగా సాగాలంటే ఒక వంటమనిషిని పెట్టుకోండి. నేను వాణ్ణి పట్టుకుని కూర్చుంటాను. మీ యిష్టమొచ్చినంతసేపు రాసుకుని హాయిగా తొమ్మిదింటికల్లా భోంచేసి ఆఫీసుకు వెళ్ళవచ్చును." అని గిరుక్కున వెనక్కు తిరిగింది.

"ఏడిశావులే, నోరు ముయ్యి." నాకు వళ్ళు మండి అనేశాను.

రాజ్యం నా మాట వినిపించుకోకుండానే వెళ్ళిపోయింది.

ఎల్లాగూ మీరు వెళ్ళింతరువాత ఒక్క నిముషంపాటు మేనువాల్చకుండా వాడితో నేను సతమత మవుతూంటానుగదా, యింట్లో ఉన్నప్పుడయినా మీరు కాస్త వాణ్ణి దగ్గరకు తీసికోగూడదా అని రాజ్యం వాదన.

అవును పాపం నిజమే ననిపిస్తుంది.

అయినా రెక్కలూ డొక్కలూ విరుచుకుని నేను సంపాదిస్తున్నానుగదా ఆడది ఆ మాత్రం వాణ్ణి సవరించుకు పోలేదా అని నా ప్రతివాదన.

ఇదీ నిజమే మరి. నన్నెవరు పాపం అంటారు?

ఆ రోజు ఎందుకో నాకు కోపం వచ్చింది. రాజ్యంకూడా తరువాత అంత సుముఖత చూపించలేదు.

గబగబా స్నానంచేసి నాలుగు మెతుకులు నోట్లోవేసుకుని లేచేసరికి ఆఫీసువేళ కానే అయింది.

2

సాయంకాలం ఆఫీసునుంచి యింటికి వచ్చేసరికే చీకటిపడిపోయింది. రాజ్యానికీ, నాకూ స్పష్టంగా పరస్పర ముఖావలోకనం జరుగకుండానే యిద్దరి భోజనాలూ ముగిసినై. వాసు నేను వచ్చేసరికే అన్నం తిని నిద్రపోయినాడు.

మామూలుగా కాగితాలూ, అవీ చూసుకుని పైకి వెళ్ళేసరికి పదకొండు గంట లయింది. ఉత్ఫుల్ల చంద్రికలో తెల్లని మా పాన్పులు నిర్మల సరోవరతరంగచాలితసితపుండరీకాలలాగా తళతళా మెరిసిపోతున్నై. పున్నాగచెట్లలోంచి దూసుకుని రివ్వున వీచే మలయానిలం సుకులు తిరిగి హాయిగా కౌగలించుకుని మత్తు కలిగిస్తూన్నది.

కండ్లు మూసుకుని పడుకున్నా ఎంతసేపటికీ నిద్రపట్టలేదు. ఆ వైఖరీ అదీ గమనిస్తే మా రాజ్యంగూడా నిద్రపోతూన్నట్టులేదు. నిశ్చలంగా అటువైపు తిరిగి పిల్లవాడిమీద చెయ్యి వేసుకుని ముడుచుకుని పడుకున్నది. ఉదయం జరిగిన కొద్ది ఘర్షణకూ యిది ఫలితం కాబోలు.

పాపం, అదృశ్యం చూస్తే నాకు జాలివేసింది. నా చేయి మెల్లిగా కదిలింది.

రాజ్యం ఉలిక్కిపడి యింకా కొంచెం గట్టిగా ముడుచుకుంది. జడలో ముడిచిన మల్లికా వాసనలు ఆమె ధరించిన ధవళాంబరాన్ని అలముకుని గాలిలో కలసి నన్ను మరీ ఉన్మత్తుణ్ణి చేసినై.

"ఇదిగో చూడూ, మాటా" అంటీ అంటకుండా కదిలించి పిలిచాను.

"అబ్బ, ఉండండీ," అని విసుక్కుని బిగుసుకుంది.

"కోపం వచ్చిందిటోయ్, యింతమాత్రానికే యిదయితే ఎల్లా వ్యవహారం? ఏమిటో చెప్పు మరీ సంగతీ" అని బుజ్జగిస్తూ నా వైపుకు తిప్పుకున్నాను.

ఈమాటు అట్టే ప్రతిఘటన చూపించలేదు రాజ్యం.

"ఏం చెయ్యమంటావు చెప్పు, ఏదో చికాకుగా ఉన్నప్పుడే యింకా కాస్త చికాకు కలిగిస్తుంటావు." నన్ను సమర్థించుకున్నాను.

"ఏం చికాకు కలిగించానండీ, చీటికి మాటికి మీకే కోపం వస్తూంటుంది గానీ," ముద్దుగా జవాబు చెప్పింది శ్రీమతి.

ఇంతలో వాసు నిద్రలో అటూ యిటూ పొర్లాడు.

"వాడికి చలి పుడ్తూన్నదేమో పాపం, దుప్పటి కప్పరాదూ" అన్నాను.

రాజ్యం దుప్పటికప్పి నావైపు తిరిగి ఎందుకో నవ్వింది. నాకూ నవ్వు వచ్చి కొంటెగా నవ్వాను.

"మరి, మనం ఏదోవిధంగా రాజీపడ్డే బాగుంటుంది— ఏమంటావు? వాడికోసం మనం రోజూ యిలా కీచులాడుకుంటూంటే ఏం బాగుంటుంది?" మళ్ళీ ప్రస్తావించాను.

"ఇంకా రాజీ ఏముందిలెండి. కొద్దికాలంలో దానంతట అదే కుదురుతుంది." ఏదో వింత సిగ్గుతో రాజ్యం జవాబుచెప్పింది.

"ఏం, ఏమిటది, ఎల్లా కుదురుతుందీ?"— నా కాశ్చర్యంవేసింది.

"ముందీనాటిదాకా ఓపిక పడ్తే మన ఇద్దరికీ ఆరోకరూ సరిపోతారు, ఒక్కడిమూలంగా పోట్లాడుకోకుండా." వ్యంగ్యంగా చిరునవ్వు చిలుకుతూ అన్నది రాజ్యం.

"ఏమిటీ, చెప్పవేం మరి,"

కందిపోయిన బుగ్గలను తుడుచుకుంటూ, "చెప్పకపోతే ఏమీ ఆగదులెండి. విదియనాడు కనపడని చంద్రుడు తదియనాడు తానే కనిపిస్తాడు." అన్నది.

"అలాగేం, ఏదీ, యిటు చూడూ." గులాబిరంగు నునుచెక్కిలి స్పృశిస్తూ కండ్లలో చూశాను.

సిగ్గుతో తల వంచుకుని కిలకిలా నవ్వింది నా రాజ్యం. ఆ సుమనురహాసంలో వేయి మల్లియలు వికసించి వెన్నెలను పరిహసించినై.

తీవిగా నా చేతుల్లోకి తీసుకున్నాను. మందస్మితంతో మారుమాటాడక నా గాఢాశ్లేషంలో ఒదిగిపోయింది నా రాణి రాజ్యం.

నెరసిన వెంట్రుకల ఔషధము

రంగు పూయ నక్కరలేదు. ఆయుర్వేద చికిత్స. తెల్లని రంగును మార్చి శాశ్వతముగా వెంట్రుకలకు నలుపు నిచ్చును. గుణం కానిచో. డబ్బు వాపసు చేయబడును.
తెలుపు కొంచమై యుండిన రూ 2-8-0.
మధ్యరకమై యుండిన రూ 3-8-0.
పూర్తిగా యుండిన రూ 5-0-0.
గమనింపు:- ఇది మెదడుకు కంటికి మంచి పోషణ నిచ్చు ఔషదము.

Dinraksh Aushadhalaya,
No. 214 P. O. Rajdhanavar (Hazaribagh.)

కాశ్మీర్
అన్నిదగ్గులకు అమోఘమైనది
గిరిజా & కో; రాజమండ్రి